కెనడాలో చెన్నై క్రీడాకారుడి ప్రతిభ

- క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఛాంపియన్‌షిప్ కైవసం
- గుకేష్‌కు స్టాలిన్ సహా నేతల శుభాకాంక్షలు



చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కెనడా రాజధాని టొరంటోలో జరిగిన ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీ టైటిల్ దక్కించుకున్న చెన్నై టీనేజ్ గ్రాండ్ మాస్టర్ గుకేష్‌కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సహా పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం జరిగిన చెస్ పోటీల్లో అమెరికాకు చెందిన హికారు నకాముకాతో గుకేష్ తలపడ్డాడు. నలుపు పావులతో ఆడిన గుకేష్ 71వ మూవ్‌మెంట్‌తో ఆట డ్రాగా ముగిసింది. దీనితో 9 పాయింట్ల ఆధిక్యతతో టైటిల్ గెలుచుకున్నాడు. గుకేష్ ఈ పోటీల్లో గెలిచిన రెండో భారతీయుడిగా గుర్తింపు పొందారు. ఇంతకు ముందు చెస్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనందన్ ఈ టైటిల్ గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో గుకేష్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ సహా పలువురు నేతల నుండి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.

చారిత్రక విజయమిది...

నగరానికి చెందిన చెస్ క్రీడాకారుడు గ్రాండ్ మాస్టర్ గుకేష్ ఫిడే క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో అద్భుతమైన విజయం సాధించారని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అన్నామలై ప్రశంసించారు. గుకేష్ పట్టుదల, ప్రతిభాపాటవాలే అతడిని ఉన్నతస్థితికి తీసుకెళ్ళాయన్నారు. ఇదే విధంగా టీఎంసీ నేత జీకే వాసన్, టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై, పీఎంకే నేత రాందాస్, అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, మక్కల్ నీదిమయ్యం నేత కమల్‌హాసన్ తదితరులు కూడా గుకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విడుదల చేసిన ఓ ప్రకటనలో అంతర్జాతీయ చదరంగంలో అద్భుతమైన కీర్తిని సాధించిన యువ క్రీడాకారుడు గుకేష్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. 17 యేళ్ల ప్రాయంలోనే కేండిడేట్స్ చెస్ టోర్నీ గెలుచుకున్న చెన్నై వాసిగా రాష్ట్రానికి మహోన్నత గౌరవం చేకూర్చాడని ప్రశంసించారు. తదుపరి పోటీల్లోనూ గుకేష్ తన ప్రతిభాపాటవాలతో మరిన్ని విజయాలు సాధించాలని స్టాలిన్ ఆకాంక్షించారు. అన్నాడీఎంకే

యువ ఛాలెంజర్‌కు శుభాకాంక్షలు..

ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రానికి చెందిన గుకేష్ పిన్నవయస్సులోనే కేండిడేట్స్ చెస్ టోర్నీ టైటిల్ గెలుచుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని, ఈ విజయాన్ని సాధించినందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. ఫిడే క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో గుకేష్ ప్రదర్శించిన ప్రతిభ అద్భుతమని, గ్రాండ్ మాస్టర్ గుకేష్ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్లు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి తెలిపారు. విశ్వనాధన్ ఆనంద్ తర్వాత ఈ టైటిల్ గెలుచుకున్న రెండో భారతీయుడిగా గుకేష్ కీర్తిగడించారని పేర్కొన్నారు.



మదురై నగరంలో ఊరేగుతున్న మహారథం - (ఇన్‌సెట్‌లో) మీనాక్షి సుందరేశ్వర స్వామి

వైభవంగా మహా రథోత్సవం

చతుర్మాడ వీధుల్లో విహరించిన మీనాక్షీ సుందరేశ్వరులు ● మదురైలో ముగిసిన చిత్తిరై ఉత్సవాలు

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మదురై మీనాక్షి, సుందరేశ్వరాలయంలో చిత్తిరై ఉత్సవాలు సోమవారం నిర్వహించిన మహారథోత్సవంతో వైభవంగా ముగిశాయి. ఈ నెల 12న ధ్వజారోహణంతో ప్రారంభమైన చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆదిదంపతులైన మీనాక్షి సుందరేశ్వరుల తిరుకళ్యాణోత్సవం తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్యస్వామి సమక్షంలో కనులపండువగా నిర్వహించారు. ఆ వేడుకల్లో నాలుగువేలమంది భక్తులు పాల్గొన్నారు. ఈ నేపథ్యలో సోమవారం వేకువజాము ఆలయంలో రథోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేకువజామున 4 నుంచి మీనాక్షి, సుందరేశ్వరులు, ముత్తంబళ్ మొదలియార్ కట్టలై మండగప్పడి, రామనాథపురం సేతుపతి మహారాజా మండగప్పడిలో వేంచేశారు.ఇరువురికి ప్రత్యేక ఆరాధనలు, పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఒకే పల్లకీలో మీనాక్షి, సుందరేశ్వరులు కీళ్‌మాసి వీధిలో ఉన్న రథమండప ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ దీపారాధన చేసిన అనంతరం సుందరేశ్వర స్వామివారు పెద్దరథంలోనూ, మీనాక్షి అమ్మవారు చిన్న రథంలో కొలువుదీరారు.రథోత్సవం ప్రారంభానికి ముందుగా అక్కడి కరుప్పణ్ణసామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆ తరువాత పంచవాయిద్యాల నడుమ భక్తులు రథానికి ఇరువైపులా ఉన్న మోకుతాళ్లను పట్టుకుని లాగారు. వేకువజాము 5.15 నుంచి మేష లగ్నంలో రథారోహణం జరిపారు. ఉదయం 6.30 గంటలకు ముందుగా స్వామివారి రథం, దాని వెనుకనే అమ్మవారి రథం బయలుదేరాయి. నాలుగు మాసి వీధుల్లో ఈ రెండు రథాలను వేలాదిమంది భక్తులు లాగుతూ వెళ్ళారు. ఈ రథాలకు ముందుగా భక్తులు మీనాక్షి సుందరేశ్వరుల పదికం కీర్తనలను ఆలాపించారు. వీరి వెనుకనే అందంగా అలంకరించిన ఆలయ గజాన్ని కూడా ఊరేగించారు. ఈ రెండు రథాల వెనుకనే వినాయకస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వేర్వేరు రథాల్లో బయలుదేరారు. ఉదయం 11.30 గంటలకు అన్ని రథాలూ మాసి వీధుల్లో ఊరేగిన తర్వాత రథమండపానికి చేరుకున్నారు. ఆ తర్వాత చండికేశ్వర్ల ఊరేగింపు నిర్వహించారు. ఇక మీనాక్షి సుందరేశ్వరర్‌ల తిరుకళ్యాణోత్సవానికి హాజరైన తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పవళక్కనివాయ్ పెరుమాళ్ రాత్రి 10.15 గంటలకు స్వక్షేత్రానికి బయలుదేరటంతో చిత్తిరై ఉత్సవాలు ముగిశాయి.



చెన్నైలో పారిశ్రామికవేత్త సీకే కుమరవేల్ కుమారుడి వివాహవేడుకలో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్, సతీమణి దుర్గాస్టాలిన్ తదితరులు

మోదీ మాటలు విషపూరితాలు

మతద్వేషానికి ఆజ్యం పోసిన విమర్శలు ● సీఎం స్టాలిన్ ధ్వజం

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తూ ప్రధాని నరేంద్రమోదీ కాంగ్రెస్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఉటంకిస్తూ చేసిన వ్యాఖ్యలు మతద్వేషాలకు ఆజ్యం పోసేలా ఉన్నాయని, తన పదవికి ఉన్న హోదా, గౌరవాన్ని కూడా మరచి విమర్శలు చేశారని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. సోమవారం సాయంత్రం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ.. ఇండియా కూటమి నేతలు అధికారంలోకి వస్తే మగువల మంగళసూత్రాలను అపహరించి, వాటివల్ల లభించే ధనాన్ని ముస్లింలకు పంచిపెడతారంటూ చేసిన ఆరోపణ గర్హనీయమన్నారు. అంతేకాకుండా గత మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను కట్టబెట్టడంలో ముస్లింలకే అంటే మైనారిటీలకే అధిక ప్రాధాన్యం ఇచ్చేదని మోదీ చేసిన ఆరోపణ ఖండించదగినదన్నారు. అందరికీ అభివృద్ధి ఫలాలు అందాలని ఆకాంక్షిస్తూ ఇండియా కూటమి తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని, అవసరమైతే దేశమంతా కులగణన నిర్వహించేందుకు కూడా సిద్ధంగా ఉందన్నారు. మోదీ చేసిన విమర్శలు ఆయన స్థాయికి తగినట్లు లేవని, మతాల మధ్య చిచ్చురగిల్చే విధంగా ఉన్నాయని స్టాలిన్ దుయ్య బట్టారు. ఎన్నికల నియమనిబంధనలు పూర్తిగా ఉల్లంఘించి మోదీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిచ్చే విధంగా ఉందన్నారు. మోదీ చేసిన వ్యాఖ్యలన్నీ మైనారిటీలపై విషం చిమ్మేలా ఉన్నాయని, మళ్ళీ అధికారంలోకి వస్తే మైనారిటీలకు వ్యతిరేకమైన ప్రభుత్వమే అధికారం చెలాయిస్తుదని పరోక్షంగా తెలియజేసేలా ఉన్నాయని తెలిపారు. ఎన్డీయే మళ్ళీ అధికారంలోకి వస్తే మైనారిటీల మధ్య చిచ్చు రగలిస్తుందని, ఇకనైనా భారత దేశ ప్రజలు మతతత్త్వవాదులైన బీజేపీ అభ్యర్థులను ఎన్నికల్లో చిత్తుగా ఓడించి ప్రజాస్వామ్యాన్ని బ్రతికించాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు.

ప్రైవేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు 25% సీట్లు

అడ్మిషన్లు ప్రారంభం

అడయార్, ఏప్రిల్ 22: ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం రిజర్వేషన్ల కింద విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. విద్యా హక్కు చట్టం-2009 అమల్లో అమల్లో భాగంగా అన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో 25 శాతం సీట్లను అర్హులైన పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉంది. ఈ సీట్లను భర్తీ చేసేందుకు ఈ అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిదివేలకు పైగా ప్రైవేటు విద్యా సంస్థలున్నాయి. ఈ స్కూల్స్‌లో ఎల్‌కేజీలో చేరే విద్యార్థులకు ఎనిమిదో తరగతి వరకు ఎలాంటి ఫీజు వసూలు చేయరు. రాష్ట్రంలో ఈ విద్యా హక్కు చట్టాన్ని 2013 నుంచి అమల్లోకి రాగా, ఇప్పటివరకు 4.60 లక్షల మంది లబ్ధి పొందారు. ఈ నేపథ్యంలో 2024-25 విద్యా సంవత్సరం కింద ఉచిత అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ ఉచిత సీట్లలో తమ పిల్లలను చేర్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పోటీపడుతున్నారు. ఈ దరఖాస్తులను వచ్చే నెల 20వ తేదీ వరకు కొనసాగనుంది. ఆర్టీఐ నిబంధన కింద మైనార్టీ స్థాయి లేని అన్ని ప్రైవేటు నర్సరీ, ప్రైమరీ, మెట్రిక్, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈబీఎస్) విద్యార్థులు ఈ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, వీరి ఆదాయం యేడాదికి రెండు లక్షల కంటే తక్కువగా ఉండాలి. అలాగే, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, ట్రాన్స్‌జెండర్, దివ్యాంగులు, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు లాటరీ విధానంలో సీట్లు కేటాయిస్తారు. దరఖాస్తుదారులు "rte.tnschools.gov.in' అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, దరఖాస్తు చేసుకునే విద్యార్థి తల్లిదండ్రుల నివాసం పాఠశాలకు ఐదు కిలోమీటర్ల పరిధిలోనే ఉండాలన్న నిబంధన ఉంది. ఆదాయ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత తల్లిదండ్రుల రిజిస్టర్ నంబరుకు అడ్మిషన్ ప్రక్రియకు సంబంధించి ఒక ఎస్ఎంఎస్ వస్తుంది. పాఠశాల యాజమాన్యం నిర్ణయించిన దరఖాస్తుల కంటే అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తే లాటరీ విధానంలో విద్యార్థుల ఎంపిక జరుగుతుంది.



అందాల పోటీలో గెలుపొందిన షంతి, వర్షా శెట్టి, సుప్రియ

మిస్ కూవాగంగా చెన్నై షంతి

● విల్లుపురంలో ఉత్సాహంగా అందాల పోటీలు

ప్యారీస్, ఏప్రిల్ 22: విల్లుపురంలో జరిగిన అందాల పోటీల్లో 'మిస్ కూవాగం'గా చెన్నైకి చెందిన హిజ్రా షంతి కిరీటం సొంతం చేసుకుంది. ద్వితీయ స్థానాన్ని పుదుచ్చేరి వర్షా శెట్టి, తృతీయస్థానాన్ని తూత్తుకుడికి చెందిన సుప్రియ దక్కించుకున్నారు. కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలో ఉన్న కూవాగం గ్రామంలో ప్రసిద్ధిచెందిన కూత్తాండవర్ ఆలయంలో చిత్తిరై వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో పాల్గొనేందుకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా హిజ్రాలు తరలివస్తున్నారు. వందలాది మంది హిజ్రాల రాకతో విల్లుపురం పట్టణంలోని లాడ్జిలు, హోటళ్లు, ప్రైవేటు భవంతులు కిటకిటలాడుతున్నాయి. హిజ్రాలను ప్రోత్సహించే విధంగా చెన్నై హిజ్రాల సంక్షేమ సంఘం, వివిధ సేవా సంస్థలు స్వచ్ఛంధంగా మిస్ కూవాగం-2024 అందాల పోటీలను ఆదివారం రాత్రి విల్లుపురం కొత్త బస్టాండ్ సమీపంలో ని కార్పొరేషన్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి, సినీ నటుడు శ్రీకాంత్, నటీమణులు అంబిక, దీప తదితరులు హాజరుకాగా, సినీ కొరియోగ్రాఫర్లు జఫ్రీవిదారక్, కవిత న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో మొత్తం 22 మంది హిజ్రాలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మూడువిడతలుగా సాగిన ఈ పోటీల్లో మహిళల ఆరోగ్యానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేశారు. ఆ ప్రకారం, మిస్ కూవాగంగా షంతి కిరీటం దక్కించుకుంది. వీరికి పోటీ నిర్వాహకులు, కార్యక్రమంలో పాల్గొన్న హిజ్రాలు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు తాళి కట్టించుకొనే కార్యక్రమం...

హిజ్రాలు ఆరాధ్య దైవం కూత్తాండవర్ కొలువైన కూవాగం గ్రామం చిత్తిరై ఉత్సవాలను పురస్కరించుకొని సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 9వ తేదీ మారియమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం చిత్తిరై ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం స్తంభ స్థాపన కార్యక్రమంతో హిజ్రాలు మూడు రోజులు పాల్గొనే వేడుకలు మొదలయ్యాయి. మంగళవారం సాయంత్రం కూత్తాండవర్ ఆలయ పూజారులచే హిజ్రాలు తాళి కట్టించుకుంటారు. మరుసటి రోజు అశేష భక్తజనం మధ్య చిత్తిరై రథోత్సవం, 25న విడయాత్తి ఉత్సవం, 26న ధర్మరాజు పట్టాభిషేకంతో చిత్తిరై ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

● రిటర్న్ జర్నీ ఎఫెక్ట్

స్వస్థలాల నుంచి తిరుగుప్రయాణం

● స్తంభించిన ట్రాఫిక్

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 19న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు నగరం నుంచి స్వస్థలాలకు వెళ్ళిన వారంతా వరుస సెలవులు ముగియడంతో ఒకే రోజు బస్సులలో, సొంత వాహనాల్లో తిరిగిరావటంతో ట్రాఫిక్ స్తంభించింది. మధురాంతకం నుంచి పెరుంగళత్తూరు వరకు వాహనాలన్నీ ఎక్కడివక్కడే నిలిచిపోయారు. మార్గమధ్యంలో ఉన్న టోల్‌గేట్ల వద్ద వందల సంఖ్యలో కార్లు, వ్యాన్‌లు, టాక్సీలు, లారీలు, మినీ వ్యాన్లు బారులు తీరాయి. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వరుస సెలవుల్లో ఇంటిపట్టునే గడిపేందుకు నాలుగు లక్షల మందికి పైగా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, కార్మికులు రాష్ట్ర రవాణా సంస్థ బస్సుల్లో నగరం నుండి స్వస్థలాలకు వెళ్ళారు. ప్రస్తుతం వారాంతపు సెలవులు కూడా ముగియడంతో అందరూ తిరిగి నగరానికి పోటెత్తారు. స్వస్థలాలకు వెళ్ళి తిరిగివస్తున్న జనాల కారణంగా ఆదివారం రాత్రే అచ్చరపాక్కం సమీపంలోని ఆత్తూరు టోల్‌గేట్ వద్ద తిరుచ్చి చెన్నై జాతీయ రహదారిలో వేల సంఖ్యలో వాహనాలు రావటంతో ట్రాఫిక్ పలుచోట్ల స్తంభించింది. వాహనాలన్నీ నత్తనడక నడిచాయి. దీనికి తోడు చెంగల్పట్టు పరనూరు టోల్‌గేట్ వద్ద సింగపెరుమాళ్ కోవిల్ వద్ద అత్యధికంగా ట్రాఫిక్ స్తంభించింది. తిరుచ్చి, మదురై నగరాల నుంచి రాజధాని చెన్నైకి ప్రత్యేక బస్సులు కూడా నడుపటంతో రహదారుల్లో వాహనాల సంఖ్య అధికమై ట్రాఫిక్ స్తంభించింది. తిరుచ్చి, మదురై నుంచి నడిపిన ప్రత్యేక రైళ్లలో వచ్చినవారంతా కాట్టాన్‌కుళత్తూరు, తాంబబరంలో దిగిన ప్రయాణికులు తమ నివాసాలకు వెళ్లేందుకు టాక్సీలు, ఆటోల కోసం గంటల కొద్దీ వేచి ఉండాల్సి వచ్చింది. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకే కాట్టాన్‌కుళత్తూరు బస్‌స్టాపు వద్ద వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. ఆ రహదారి దాటేందుకు కూడా స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో తిరువణ్ణామలైలో చిత్రా పౌర్ణమికి కిలాంబాక్కం నుంచి సోమవారం ఉదయమే ప్రత్యేక బస్సులు నడపటంతో అవి కూడా పలు చోట కదలలేకపోయాయి. ఇదే విధంగా కోయంబేడు, మధురవాయల్, రెడ్‌హిల్స్, పూందమల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది.



చెంగల్పట్టు సమీపం పరనూరు టోల్‌గేట్ వద్ద ఆగిన వాహనాలు

సమాచార దర్శిని

కిలంబాక్కం బస్ టెర్మినల్‌కు కొత్త మార్గం

ఐసిఎఫ్, ఏప్రిల్ 22: స్థానిక కిలంబాక్కం ఎంటీసీ బస్టాండ్ నుంచి సబర్బన్ టెర్మినల్‌కు కొత్త మార్గం ఏర్పాటుచేయనున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. ప్రతి రోజు కిలంబాక్కం బస్టాండ్‌ను 80,000 మందికి పైగా వినియోగిస్తున్నారు. సిటీ బస్టాండ్ నుంచి కిలంబాక్కం బస్టాండ్ వెళ్లేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో వాహన సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రయాణికులు సులభంగా ఇక్కడి నుంచి అక్కడకు చేరుకొనేలా కొత్త మార్గం త్వరలో ఏర్పాటుచేయనున్నామని అధికారులు తెలిపారు.

మెట్రో రైల్వేస్టేషన్లలో పెరగనున్న పార్కింగ్ ఫీజు ?

ప్యారీస్, ఏప్రిల్ 22: రాజధాని నగరంలోని మెట్రో రైల్వేస్టేషన్లలో వాహనాల పార్కింగ్ ఫీజు పెంచేందుకు పరిశీలిస్తున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. మెట్రో రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు సీఎంఆర్ఎల్ సంస్థ వసతులు మెరుగుపరుస్తూ వస్తోంది. ఉత్తర చెన్నైలోని వాషర్‌మెన్‌పేట నుంచి దక్షిణ చెన్నైలో ఉన్న విమానాశ్రయం వరకు, సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి సెయింట్ థామస్ మౌంట్, వింకోనగర్ ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్లలో పార్కింగ్ సదుపాయం ఉంది. రోజురోజుకు పార్కింగ్ చేస్తున్న వాహనాల సంఖ్య పెరుగుతుండడంతో వసతులు మరికొంత పెంచేందుకు నిర్ణయం తీసుకున్న సీఎంఆర్ఎల్ సంస్థ, త్వరలోనే అధికారపూర్వకంగా ప్రకటిస్తుందని అధికారులు తెలిపారు.

మద్రాసు వర్సిటీలో అడ్మిషన్ల ప్రకటన విడుదల

ఐసిఎఫ్, ఏప్రిల్ 22: ప్రైవేటు కళాశాలల్లో విద్యా ఫీజు లేకుండా కోర్సులు నిర్వహించే పథకంలో అడ్మిషన్లకు మద్రాసు విశ్వవిద్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ఏలుమలై విడుదల చేసిన ప్రకటనలో... ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు, అనాథలు, కుటుంబంలో తొలిసారిగా డిగ్రీలో చేరనున్న వారికి ప్రైవేటు కళాశాలల్లో ఫీజులేకుండా చదివేలా మద్రాసు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉచితవిద్యా పథకం అమలులో ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించిన వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో విడుదల చేశామని తెలిపారు. ప్లస్ టూ పరీక్షా ఫలితాలు విడుదలైనప్పటి నుంచి 15 రోజుల్లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు.ఈపథకంలో చేరేవిద్యార్థుల కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షలలోపుండాలని తెలిపారు.

పెరిగిన బీన్స్ ధరలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 22: కోయంబేడు మార్కెట్లో బీన్స్ ధర పెరిగింది. ఒక కిలో రూ.40కు విక్రయమైన బీన్స్ గత వారం రూ.100, రూ.120, రూ.160 అని పెరుగుతూ ప్రస్తుతం రూ.220కు విక్రయమవుతోంది. క్యారట్ ధర రూ.10 నుంచి రూ.15 వరకు పెరిగింది. ఇతర కూరగాయల ధరల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు.

సేలం విమాన సర్వీసు వేళల్లో మార్పులు

అడయార్, ఏప్రిల్ 22: చెన్నై - సేలం ప్రాంతాల మధ్య నడిచే విమాన సర్వీసు వేళల్లో మార్పులు చేశారు. ఈ రెండు ప్రాంతాల మధ్య ఇండిగో విమాన సంస్థ ఒక సర్వీసు నడుపుతోంది. ప్రతి రోజూ ఉదయం 10.35 గంటలకు బయలుదేరి 11.40 గంటలకు చేరుకునేంది. తిరిగి మధ్యాహ్నం 12.40 గంటలకు సేలంలో బయలుదేరి 1.50కి చెన్నై వచ్చేది. ఇక నుంచి విమానం సాయంత్రం 5 గంటలకు సేలంలో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు చెన్నైకు చేరుకోనుంది. దీంతో ప్రతి రోజూ ఈ రెండు ప్రాంతాల మధ్య నడిచే విమాన సర్వీసు రద్దు అయింది.

75 శాతం మార్కులుంటే పీహెచ్‌డీలో చేరొచ్చు

ఐసిఎఫ్, ఏప్రిల్ 22: యూజీ కోర్సుల్లో 75 శాతం మార్కులు పొందిన వారు పీహెచ్‌డీలో చేరవచ్చని యూజీసీ అధ్యక్షుడు జగదీష్‌కుమార్ తెలిపారు. ఉన్నత విద్యలో యూజీ కోర్సులో నాలుగేళ్లు చదివిన విద్యార్థులు నేరుగా జాతీయ అర్హత పరీక్ష (ఎన్ఈటీ) రాయవచ్చు. అలాగే, నేరుగా పీహెచ్‌డీ చదవడంతో పాటు జేఆర్ఎఫ్ కోర్సుల్లో కొనసాగవచ్చని తెలిపారు. ఇందుకోసం విద్యార్థులు తమ నాలుగేళ్ల యూజీ కోర్సుల్లో కనిష్టంగా 75 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. జాతీయ అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 55 శాతం మార్కులతో పీజీ కోర్సు పూర్తిచేసి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు యూజీసీ నిబంధనల మేరకు 5 శాతం మార్కులను సడలించినట్లు పేర్కొన్నారు.

సెలవు రోజుల్లో నో స్పెషల్‌క్లాస్!

● పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

ప్యారీస్, ఏప్రిల్ 22: వేసవి సెలవులు, ప్రభుత్వ సెలవు రోజుల్లో పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు, ఇతర తరగతుల వార్షిక పరీక్షలు ముగిసి సెలవులు ప్రకటించారు. సెలవు రోజుల్లో కొన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు సంబంధించి ప్రకటనలు కూడా చేసినట్లు పాఠశాల విద్యాశాఖకు ఫిర్యాదులందాయి. సీఎం ప్రత్యేక సెల్‌లో సమర్పించిన 14,417 ఫిర్యాదుల్లో కూడా సెలవు రోజుల్లో పాఠశాలలు పనిచేస్తాయని సూచించారు. దీనిపై స్పందించిన పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలకు సోమవారం ఓ సర్క్యులర్ జారీచేసింది. సెలవు రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోను ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని, ముఖ్యంగా విద్యార్థులు పాల్గొనేలా ఒత్తిడి చేయరాదని, ఆదేశాలు ఉల్లంఘిస్తే సంబంధిత పాఠశాలలపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరికలు జారీచేశారు.

జూన్ 4న మోదీ పదవీ విరమణ

పెరంబూర్, ఏప్రిల్ 22: వృద్ధాప్యం కారణంగా మోదీ జూన్ 4న ప్రధాని పదవి నుంచి విరమణ చేయనున్నారని కాంగ్రెస్ ఎంపీ మాణిక్ ఠాగూర్ తెలిపారు. ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెంపు, యువత ఉపాధి అవకాశాలు లేకపోవడంతో, రైతులకు గిట్టుబాటు ధర, రుణాలు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీనిని అధికమించాలంటూ దేశానికి యువ నాయకత్వం అవసరమన్నారు.అందువల్ల వృద్ధాప్యంతో ఉన్న మోదీ చేత జూన్ 4వ తేదీ పదవీ విరమణ చేయించి ఇంటికి పంపించాలని దేశ ప్రజలు నిర్ణయం తీసుకుంటున్నారని మాణిక్యం ఠాగూర్ తెలిపారు.

చైల్డ్ కేర్ కాంప్లికేషన్స్‌పై సదస్సు ప్రారంభం

అడయార్, ఏప్రిల్ 22: నగరంలోని శ్రీ రామచంద్ర మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో చైల్డ్‌కేర్ కాంప్లికేషన్స్‌పై ఔట్‌పేషంట్స్ ఫిజిషియన్ కోసం సోమవారం సదస్సు ప్రారంభమైంది.పిల్లలఆరోగ్యసంరక్షణలో వారి నైపుణ్యాలు, సాధారణ పీడియాట్రిక్ సమస్యలు, సంరక్షణ, ఇటీవలకాలంలో జరిగిన పురోగతి, ప్రపంచవ్యాప్తంగా కొత్త వ్యూహాలు, సురక్షితమైన టీకా పద్ధతులు తదితర అంశాలపై ఈ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్ఆర్ఐహెచ్ఈఆర్ ఎడ్యుకేషన్ విభాగం డీన్, పీడియాట్రిక్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ లతా రవిచంద్రన్ సారథ్యం వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఫిజీషియన్స్‌లు ఎన్నో క్రిటికల్ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోగలుగుతారన్నారు. ఇందులో పాల్గొనేందుకు ఎలాంటి డెలిగేట్ ఫీజు వసూలు చేయలేదని ఆమె తెలిపారు. ఈ సదస్సులో 180 మంది వరకు ఫిజీషియన్లు పాల్గొన్నారు.

34వ సారి సెంథిల్ బాలాజీ రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 22: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను న్యాయస్థానం 34వ సారి పొడిగించింది. చట్టవ్యతిరేక నగదు బట్వాడా నిరోధక చట్టం కింద సెంథిల్ బాలాజీని గత ఏడాది జూన్‌లో అరెస్ట్ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కోర్టు ఉత్తర్వుల మేరకు పుళల్ జైలుకు తరలించారు. సెంథిల్ బాలాజీ దాఖలుచేసిన బెయిలు పిటిషన్లను చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు, మద్రాసు హైకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో, ఆయన రిమాండ్‌ను సెషన్స్ కోర్టు పొడిగిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో, ఆయనకు విధించిన రిమాండ్ గడువు సోమవారం ముగియడంతో, న్యాయస్థానం ఉత్తర్వులతో పుళల్ జైలు నుంచి భారీ బందోబస్తు నడుమ సెంథిల్ బాలాజీని చెన్నై సెషన్స్ కోర్టులో హాజరుపరచగా, ఆయన రిమాండ్‌ను ఈ నెల 25వ తేది వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి అల్లి ఉత్తర్వులు జారీచేశారు. అదే సమయంలో, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుకు సంబంధించి అసలు పత్రాలు అందించాలంటూ సెంథిల్ బాలాజీ తరపున పిటిషన్ దాఖలుకాగా, ఆ పత్రాలను సోమవారం ఆయనకు అప్పగించారు. కాగా, ఈడీ కేసు నుంచి తనను విడిపించాలనే సెంథిల్ బాలాజి దాఖలుచేసిన పిటిషన్‌పై వాదోపవాదనలు మరో రెండు రోజుల్లో ప్రారంభమవుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



జైలుకు హాజరవుతున్న సెంథిల్ బాలాజి

ఎల్కేజీ సీటు కోసం ప్రైవేటు స్కూలు వద్ద తల్లిదండ్రుల జాగారం



ప్రైవేటు స్కూలు వద్ద బారులు తీరిన విద్యార్థుల తల్లిదండ్రులు

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా పాళయం కోటలోని ఓ ప్రైవేటు స్కూలులో తమ పిల్లలకు ఎల్కేజీ సీటు సంపాదించడానికి తల్లిదండ్రులు ఆ స్కూలు ప్రహరీ వద్ద ఆదివారం రాత్రంతా జాగారం చేసి సోమవారం ఉదయం క్యూలైన్లలో నిలబడ్డారు. దక్షిణభారత ఆక్స్‌ఫర్డ్ సిటీగా పాళయం కోట ప్రసిద్ధిగాంచింది. పాళయం కోటలో ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటిలో ఓ ప్రైవేటు స్కూలులో ఎల్కేజీ సీటు కోసం స్థానికులు పోటీపడుతుంటారు. సోమవారం ఎల్కేజీ అడ్మిషన్లకు దరఖాస్తులు ఇస్తామని ఆ స్కూలు యాజమాన్యం ప్రకటించింది.. దీంతో పాళయం కోటలోని పిల్లల తల్లిదండ్రులు దరఖాస్తు కోసం ఆదివారం రాత్రి ఆ స్కూలు ప్రహరీగోడ వద్దే నిద్రపోయారు. సుమారు వందమందికి పైగా పిల్లల తల్లిదండ్రులు రాత్రంతా జాగారం చేసి సోమవారం ఉదయం క్యూలైన్లలో నిలిచి దరఖాస్తులు తీసుకున్నారు.

ఆమ్నీ బస్సులకు రూ.85 వేల జరిమానా

ఐసిఎఫ్, ఏప్రిల్ 22: సేలం జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన 40 ఆమ్నీ బస్సులకు అధికారులు రూ.85వేల జరిమానా విధించారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని సొంతూళ్లకు వెళ్లి తిరిగి వస్తున్న వారి సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. కొంతమంది ప్రైవేటు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రైవేటు బస్సు యజమానులు ఛార్జీలు పెంచుతున్నట్లు రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదులందాయి. సేలం కొత్త బస్టాండ్, ఓమలూరు, వాలప్పాడి తదితర ప్రాంతాల్లో అధికారులు వాహన తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 40 ఆమ్నీ బస్సుల యజమానులకు జరిమానా విధించారు.

జలాశయాల్లో 7,059 మిలియన్ ఘనపుటడుగుల నీటి నిల్వలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 22: నగరానికి తాగునీరు సరఫరా చేసే జలాశయాల్లో 7,059 మిలియన్ ఘనపుటడుగుల నీటి నిల్వలున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. 3,231 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన పూండి జలాశయంలో 1,176 మిలియన్ ఘనపుటడుగులుంది. తాగునీటి అవసరార్థం 250 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. 1,081 మిలియన్ ఘనపుటగుడుల సామర్థ్యం ఉన్న చోళవరం జలాశయంలో 200 మిలియన్ ఘనపుటడుగులు నీరుండగా, తాగునీటికి 200 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. 3,645 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన చెంబరంబాక్కం జలాశయంలో 2,472 మిలియన్ ఘనపుటడుగులుండగా, 109 ఘనపుటడుగులు తాగునీటి కోసం విడుదల చేస్తున్నారు. 3,300 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన పుళల్ జలాశయంలో 2,815 మిలియన్ ఘనపుటడుగుల నీరుండగా, తాగునీటికి 186 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. 500 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన కన్నన్ కోట జలాశయంలో 396 మలియిన్ ఘనపుటడుగులు నిల్వలున్నాయి. చెన్నై వాసులకు వేసవి కాలంలో తాగునీటి కొరత ఉండదని అధికారులు తెలిపారు.

29కి కొడనాడు కేసు వాయిదా

ప్యారీస్, ఏప్రిల్ 22: నీలగిరి జిల్లా కోతగిరి సమీపంలో ఉన్న కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడీ సంబంధిత కేసుల విచారణ ఈనెల 29వ తేదీకి వాయిదావేస్తూ ఊటీ జిల్లా సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడీ సంఘటనలపై సీబీసీఐడీ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఊటీలో ఉన్న జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ కొనసాగుతుంది. ప్రస్తుతం ఆ కోర్టు న్యాయమూర్తి అబ్దుల్ ఖాదర్ సెలవుల్లో వెళ్లినందున సోమవారం ఈ కేసు మరో న్యాయమూర్తి శ్రీధరన్ సమక్షంలో విచారణకు వచ్చింది. అయితే ఈ కేసులో సంబంధాలున్న ముద్దాయిలు ఒక్కరు కూడా విచారణకు హాజరుకాలేదు. ప్రభుత్వ తరపున న్యాయవాదులు షాజహాన్, కనకరాజ్, సీబీసీఐడీ పోలీసులు హాజరయ్యారు. 10 మంది ముద్దాయిలు విచారణకు హాజరుకానుందున తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదావేస్తూ న్యాయమూర్తి శ్రీధరన్ ఉత్తర్వులు జారీచేశారు.

మాణిక్యం ఠాగూర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ తోసివేత

ప్యారీస్, ఏప్రిల్ 22: విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మాణిక్యం ఠాగూర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో విరుదునగర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాణిక్యం ఠాగూర్ పోటీచేశారు. ఆయన మద్దతుదారులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఓటర్లకు టోకెన్లు పంపిణీ చేశారని ఆరోపిస్తూ, ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ చెల్లకుమార్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో... ఈ వ్యవహారానికి సంబంధించి ఈ నెల 14న ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు.ఈనేపథ్యంలో సోమవారం ఈ పిటిషన్ పరిశీలించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గంగాపూర్‌వాలా, న్యాయమూర్తి సత్యనారాయణన్‌లతో కూడిన ప్రథమ ధర్మాసనం. పిటిషనర్ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని కారణం చెబుతూ పిటిషన్ తోసిపుచ్చారు.

శరణార్థుల శిబిరంలో యువకుడి ఆత్మహత్య

ప్యారీస్, ఏప్రిల్ 22: స్థానిక పుళల్ కావాంగరైలో ఉన్న శరణార్థుల శిబిరంలో శ్రీలంకకు చెందిన తమిళులు ఆశ్రయం పొందుతున్నారు. ఈ శిబిరంలో శివలింగం కుమారుడు షమీన్సన్ (17) అనే ఫుట్ బాల్ క్రీడాకారుడు షూ కొనుగోలు చేసేందుకు తండ్రిని రూ.2,000 అడిగాడు. ఆయన లేదని చెప్పడంతో షమీన్సన్ ఈ నెల 14వ తేది శరీరంపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. అతడిని కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు పుళల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రారంభమైన ప్రైమరీ స్కూల్ పరీక్షలు

పెరంబూర్, ఏప్రిల్ 22: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వార్షిక పరీక్షల కోసం సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు ముగిసాయి. ఈ నేపథ్యంలో, 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఈ నెల 8వ తేది నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం గతంలో నిలిపివేసిన సైన్స్ పరీక్ష నిర్వహించగా, మంగళవారం సోషల్ పరీక్ష జరుగనుంది. అనంతరం 24వ తేది నుంచి పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు.... ప్రధానోపాధ్యాయుడికి రెండు యావజ్జీవాలు

పెరంబూర్, ఏప్రిల్ 22: ఆరుగురు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో ప్రధానోపాధ్యాయుడిని న్యాయస్థానం రెండు యావజ్జీవ శిక్షలు విధిస్తూ సోమవారం తీర్పు చెప్పింది. కాళయార్‌కోయిల్ ప్రాంతంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురుగన్ 2014లో పాఠశాలలోని విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఓ బాధితురాలి అవ్వ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదుచేసి మురుగన్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో జరుగుతుండగా ఇరుతరఫు వాదనలు ముగియడంతో న్యాయమూర్తి పాఠశాల హెచ్ఎంకు 47 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.69,000 జరిమానా విధించారు. అలాగే, బాధిత బాలికలకు ప్రభుత్వం తరపున రూ.29 లక్షలు అందజేయాలని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ధనుష్కోటికి ముగ్గురు శరణార్థుల రాక



ధనుష్కోటికి వచ్చిన లంక శరణార్థులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 22: ముగ్గురు శ్రీలంక శరణార్థులు సోమవారం పడవలో ధనుష్కోటికి వచ్చారు. శ్రీలంకలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా ఇటీవల ఉత్తర, తూర్పు ప్రాంతాల నుంచి సుమారు 300 మందికి పైగా శరణార్థులుగా ధనుష్కోటి వచ్చారు. ఈ నేపథ్యంలో, సోమవారం ఓ బాలుడు సహా ముగ్గురు ధనుష్కోటి అరిచ్చల్‌మునై ప్రాంతానికి పడవలో వచ్చారు. వారి గురించి జాలర్లు సముద్రతీర భద్రతా దళానికి సమాచారమందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని విచారణ జరిపి మట్టకలిప్పు ప్రాంతానికి చెందిన గజేంద్రన్ (45), ఆయన కుమారుడు సుజిత్ మేనన్ (8), శివనేశ్వరన్ (49) అనే వారిని మండపంలో ఉన్న శిబిరానికి తరలించారు.

చిదంబరం ఆలయ అశ్వం మృతి

ఐసిఎఫ్, ఏప్రిల్ 22: చిదంబరం నటరాజస్వామి ఆలయ అశ్వం అస్వస్థత కారణంగా మృతిచెందింది. ఈ ఆలయంలో అశ్వ పూజ కోసం గుర్రాన్ని పెంచుతున్నారు. నాలుగేళ్ల రాజా అనే ఈ గుర్రం ఇటీవల అస్వస్థతకు గురైంది. వారం రోజులు పశు వైద్యులు చికిత్స చేశారు. ఆదివారం చికిత్స ఫలించక అశ్వం మృతిచెందింది. రాజా ఆత్మకు శాంతి లభించేలా భక్తులు, దీక్షితులు పుష్పాంజలి ఘటించి అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్యారీస్, ఏప్రిల్ 22: కాంచీపురం జిల్లా ఒరగడం సమీపంలో బైక్‌ను ప్రైవేటు బస్సు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. వాలాజాబాద్ సమీపంలోని శివరం గ్రామానికి చెందిన మైఖేల్ (21) ఒరగడం ప్రాంతంలో ఉన్న లారీ కర్మాగారంలో పనిచేస్తున్నాడు. రోజులాగే సోమవారం ఉదయం 7 గంటలకు తన బైక్‌పై ఇంటి నుంచి బయల్దేరిన మైఖేల్, ఒరగడం ప్రాంతం చేసుకున్న సమయంలో సింగపెరుమాళ్‌కోయిల్ వైపు నుంచి వచ్చిన ఓ ప్రైవేటు బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అన్నామలైపై కేసు నమోదు

పెరంబూర్, ఏప్రిల్ 22: కడలూరు జిల్లా శ్రీముష్ణం గోమతి అనే మహిళ హత్య కేసులో, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వ్యాపింపజేశారంటూ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై కడలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. హింసను ప్రేరేపించడం సహా మూడు సెక్షన్ల కింద అన్నామలైపై కేసు నమోదైంది. కాగా, ఈ కేసులో తప్పుడు సమాచారం వ్యాప్తిచేశారని ఇదివరకే సిన్హా, హరిప్రభాకర్, షణ్ముగం తదితరులపై పోలీసులు కేసు నమోదుచేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 22: విరుదునగర్ జిల్లా ఆలయ వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. శ్రీవిల్లిపుత్తూర్ సమీపంలోని ఓ గ్రామంలోని ఆలయ వేడుకలు త్వరలో జరుగున్నాయి. ఈ వేడుకల కోసం పలువురు యువకులు గ్రామంలో బ్యానర్లు కడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో బ్యానర్ కడుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న కల్యాణ్‌కుమార్ (19) మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టగా, ఆలయ వేడుకల్లో ప్రారంభంలోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మెడికల్ వేస్టేజ్ శుద్ధీకరణ ప్లాంట్‌కు సీలు

అడయార్, ఏప్రిల్ 22: మెడికల్ వేస్టేజ్ (వైద్య వ్యర్థాలు)ను శుద్ధీకరించే ప్లాంట్ నుంచి వెలువడుతున్న విష వాయువులు పీల్చిన స్థానికుల్లో పది మందికిపైగా అస్వస్థతకు లోనయ్యారు. దీంతో ఈ ప్లాంట్‌కు అధికారులు సీలు వేశారు. ఈ సంఘటన విల్లుపురం జిల్లా విక్రమాండి సమీపంలోని వేడంపట్టు అనే గ్రామంలో జరిగింది. రెండు రోజుల క్రితం ఈ ప్లాంట్ నుంచి విషపూరిత వాయువులు వెలువడటాన్ని గుర్తించిన స్థానికులు అప్రమత్తమయ్యారు. అప్పటికే అనేక మంది గ్రామప్రజలు అస్వస్థతకు లోనయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌లో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని ప్లాంట్‌కు సీలు వేశారు. ఈ విషవాయువు లీకేజీపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



ఘటనలో నుజ్జునుజ్జయిన కారు - మృతులు గౌతమ్, మణికంఠన్ (ఫైల్‌ఫొటోలు)

పెరంబూర్, ఏప్రిల్ 22: సేలం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్లస్ టూ విద్యార్థి సహా ఇద్దరు మృతి చెందారు. వేడంపట్టికి చెందిన మణికంఠన్, ప్లస్ టూ విద్యార్థి గౌతమ్ (16) కారులో సేలం వైపు బయల్దేరారు. డ్రైవర్ సుందరం నడుపుతున్న స్కార్పియో కొండాలంపట్టి ప్రాంతంలో అతివేగంగా వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, అదే వేగంతో ముందు వెళ్తున్న లారీని ఢీకొని, రౌండ్ ఠానా ప్రాంతంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మణికంఠన్, గౌతమ్‌లు తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, గాయపడిన డ్రైవర్ సుందరంను ప్రైవేటు ఆస్పత్రికి తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విషజ్వరంతో బాలుడి మృతి



మృతుడు శివ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, ఏప్రిల్ 22: స్థానిక రెడ్‌హిల్స్ సమీపంలో విషజ్వరానికి ఏడేళ్ల బాలుడు మృతిచెందడంపై ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న శివ (7)కు తల్లిదండ్రులు, మెడికల్ షాప్ నుంచి తెచ్చిన మాత్రలు వేసినట్లు సమాచారం. జ్వరం లక్షణాలు తగ్గకపోగా ఆదివారం ఆహారం తీసుకొన్న శివ హఠాత్తుగా స్పృహతప్పి కిందపడ్డాడు. తల్లిదండ్రులు అతడిని సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని క్రిమినాశిని మందు పిచికారీ చేసి, ప్రజలు వైద్యపరీక్షలు నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు.

రెండు టన్నుల బీడీ ఆకుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బీడీ ఆకులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 22: పడవలో శ్రీలంక తరలించేందుకు ప్రయత్నించిన రెండు టన్నుల బీడీ ఆకు బండిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తూత్తుకుడి జిల్లా సముద్రతీర ప్రాంతాల నుంచి శ్రీలంకకు గంజాయితో పాటు మత్తు పదార్థాలు, బీడీ ఆకు, పసుపు వంటి వస్తువులు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వీటిని అడ్డుకొనేలా పోలీసులు గస్తీ చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, కాయిల్‌పట్నం, వీరపాండ్యన్ పట్నం ప్రాంతాల మధ్య ఉన్న సముద్రతీరంలో మత్తు పదార్థాలను పడవలో శ్రీలంకకు తరలిస్తున్నట్లు తూత్తుకుడి క్యూ బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు సోమవారం వేకువజామున 3.30 గంటలకు పెద్ద పెద్ద బండిళ్లతో అనుమానాస్పదంగా నిల్చున్న కొందర్ని గమనించి అదుపులోకి తీసుకొనేందుకు యత్నించారు. పోలీసులను గమనించి పరారయ్యేందుకు ప్రయత్నించగా వారిలో నలుగురు పట్టుబడ్డారు. వారి వద్ద 50 బస్తాల్లో సుమారు 2 టన్నుల బరువు కలిగిన బీడీ ఆకును స్వాధీనపరుచుకొని విచారణ జరుపుతున్నారు.

రూ.1.87 లక్షలకు విక్రయమైన చేప

ఐసిఎఫ్, ఏప్రిల్ 22: తంజావూరులో 25 కిలోల బరువున్న చేప రూ.1,87,700లకు విక్రయమైంది. అభిరామపట్నం కరయూర్ వీధికి చెందిన జాలరి రవి శనివారం రాత్రి చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లాడు. ఆదివారం వలలో చిక్కుకున్న చేపలతో తీరానికి చేరుకున్నారు. వాటిలో 25 కిలోల బరువున్న 'కూరైకత్తాలై' అనే చేప ఉండడాన్ని గుర్తించారు. ఈ చేపలో ఔషధ గుణాలుండడంతో పెద్ద మార్కెట్లో వేలానికి ఉంచారు. ఓ వ్యాపారి రూ.1.87 లక్షలకు ఈ చేప కొనుగోలు చేశారు.

మూడుముళ్ల బంధం సాక్షిగా రక్తదానం



రక్తదానం చేస్తున్న వధూవరులు

ప్యారీస్, ఏప్రిల్ 22: వివాహం జరిగిన వేదిక వద్దే వధూవరులు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. విల్లుపురం జిల్లా సెంజి సమీపంలోని నరసింగరాయన్‌పేటకు చెందిన ఇంజనీర్ కేశవప్రకాష్, రాణిపేట జిల్లా మాదన్‌తాంగల్ గ్రామానికి చెందిన హోమియోపతి వైద్యురాలు సోనియా వివాహం ఆదివారం సెంజి సమీపంలోని అప్పంపట్టిలోని కల్యాణ మండపంలో జరిగింది. ఆహ్వాన పత్రికలో వివాహం జరిగిన వెంటనే రక్తదాన శిబిరం జరుగుతుందని ముద్రించారు. ఆ మేరకు ముండియంబాక్కం ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంక్ అధికారుల సమక్షంలో వధూవరులతో పాటు వివాహానికి హాజరైన 10 మందికి పైగా రక్తదానం చేశారు.

కాషాయం త్యాగానికి ప్రతీక

● సీఎం స్టాలిన్‌కు తమిళిసై కౌంటర్

ప్యారీస్, ఏప్రిల్ 22 : కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని దూరదర్శన్ లోగోను ఎరుపు రంగు నుంచి కాషాయ రంగులోకి మార్చటం పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేయడం సమంజసం కాదని, కాషాయమంటే త్యాగానికి ప్రతీక అని మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ పేజీలో ఓ ప్రకటన విడుదల చేస్తూ ఆలిండియా రేడియోకు ఆకాశవాణి అనే నామకరణం చేసింది డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమేననే విషయం కూడా తెలియకుండా స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడం గర్హనీయమన్నారు. ఆంగ్లంలో ఉన్న సన్‌టీవీ పేరును తమిళంలోకి ఎప్పుడు మారుస్తారని తమిళిసై సూటిగా ప్రశ్నించారు. కాషాయమంటే ఒక మతానికి చెందిన రంగు కాదని, ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంచుతుందని తమిళిసై పేర్కొన్నారు.

రూ.4కోట్ల నగదు స్వాధీనం కేసు... విచారణకు గడువు కోరిన నయినార్ నాగేంద్రన్



చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తన సహాయకుల వద్ద ఈ నెల 6వతేదీ రూ.4 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్న సంఘటనకు సంబంధించి విచారణకు హాజరయ్యేందుకు తిరునల్వేలి బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ పది రోజుల గడువు కోరారు. ఈ మేరకు పోలీసులకు దరఖాస్తు పెట్టుకున్నారు. తాంబరం రైల్వేస్టేషన్ వద్ద ఎన్నికల సంఘం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రూ.4 కోట్ల మేర నగదు పట్టుబడింది. ఆ సంఘటనకు సంబంధించి నయినార్ నాగేంద్రన్ నడుపుతున్న హోటల్ మేనేజర్ సతీష్, సహాయకులు నవీన్, పెరుమాళ్‌ను అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో విరుగంబాక్కంకు చెందిన మురుగన్, జయశంకర్, ఆసై తంబి అనే వారు ఆ నగదును కీల్పాక్కంలోని హోటల్‌లో ఉంచి వెళ్ళిపోయారంటూ అరెస్టయిన వారు వాంగ్మూలం ఇచ్చారు. ఈ సంఘటన దరిమిలా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఈ నెల 7న నయినార్ నాగేంద్రన్‌కు చెందిన హోటళ్లు తదితర ప్రాంతాల్లో సోదాలు జరిపారు. అదేసమయంలో రూ.4కోట్ల నగదు స్వాధీనంపై ఐటీ అధికారులు కూడా విచారణ చేపట్టారు. తాంబరం పోలీసులు కూడా కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. నగదు స్వాధీనం చేసుకున్న కేసుకు సంబంధించి సోమవారం తమ ఎదుట విచారణకు హాజరుకావలంటూ తిరునల్వేలి బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్‌కు సమన్లు జారీ చేశారు. ఆ మేరకు సోమవారం ఉదయం ఆయన పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరవుతారని అందరూ ఎదురు చూశారు. చివరకు నయినార్ నాగేంద్రన్ పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. అదే సమయంలో తన తరపు న్యాయవాది డేవిడ్ ద్వారా విచారణకు హాజరయ్యేందుకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ దరఖాస్తు పెట్టించారు. అనివార్య కారణాల వల్ల నయినార్ నాగేంద్రన్ హాజరుకాలేకపోయరని, పది రోజుల తర్వాత ఆయన తప్పకుండా విచారణకు హాజరవుతారంటూ న్యాయవాది డేవిడ్ తాంబరం పోలీసు ఉన్నతాధికారులకు తెలిపారు. నయినార్ నాగేంద్రన్ దరఖాస్తు స్వీకరించిన తాంబరం సీఐ బాలమురళి తదుపరి చర్యలను ప్రారంభించారు.

తిరుపత్తూరు నడిరోడ్డులో బైకు దగ్ధం



చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లాకలెక్టర్ కార్యాలయం సమీపంలో నడిరోడ్డులో ఓ బైకు దగ్ధమైంది. విష్ణువర్ధన్ అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం కళాశాల నుంచి బైకుపై ఇంటికి వెళ్తుండగా ఉన్నట్టుండి బైకు నుంచి మంటలు చెలరేగాయి. దీంతో దిగ్భ్రాంతి చెందిన విష్ణువర్ధన్ బైకును నడిరోడ్డులో విడిచి పెట్టి భయంతో పరుగెత్తారు. కాసేపటికల్లా ఆ బైకు మంటలల్లో పూర్తిగా దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఆ బైకు ఎముకల గూడుగా మిగిలింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ముగిసిన రోహిణి శాస్త్రి అంత్యక్రియలు

అడయార్, ఏప్రిల్ 22: నగరంలో శాస్త్రి బ్రదర్స్‌లో ఒకరైన రోహిణి శాస్త్రి (70) శనివారం ఉదయం మృతి చెందగా ఆయన అంత్యక్రియలు సోమవారం పూర్తిచేశారు. ఆయన సోదరుడు అశ్విని శాస్త్రి, ఈయన కుమారులు అమెరికా నుంచి వచ్చిన తర్వాత రోహిణి శాస్త్రి అంత్యక్రియలను టీ.నగర్‌లోని కన్నమ్మ శ్మశానవాటికలో సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో నిర్వహించారు. ఆయన అంత్యక్రియలను రోహిణి శాస్త్రి మనవడు (కుమార్తె కుమారుడు) పూర్తిచేశారు. ఈ అంత్యక్రియల్లో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

గ్లోబెల్ ఆస్పత్రిలో డీప్ బ్రెయిన్ సిములేషన్ సర్జరీ

అడయార్, ఏప్రిల్ 22: నగరానికి చెందిన గ్లెనెగల్స్ హెల్త్ సిటీ 23 యేళ్ళ రోగికి అత్యంత అరుదైన బ్రెయిన్ సిములేషన్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా తొలి దశలో పేషెంట్ తెలివితో ఉన్న సమయంలోనే రెండు చిన్న రంధ్రాల ద్వారా మెదడులోకి ఎలక్ట్రోడ్‌లను అమర్చారు. పదేళ్ళ బాలుడికి ఈ రేరెస్ట్ చికిత్స చేయగా, ప్రస్తుతం ఆ రోగి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడు. ఈ ఆస్పత్రికి చెందిన న్యూరాలజీ అండ్ అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ఎప్లిప్సీ డైరెక్టర్ డాక్టర్ దినేష్ నాయక్ సారథ్యంలోని వైద్య బృందం ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసింది. ఎంతో క్లిష్టమైన డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ ఆపరేషన్ చేయాలని నిర్ణయించి విజయవంతంగా పూర్తి చేసినట్టు పేర్కొన్నారు.

రీ పోలింగ్ జరపాలి!

● బీజేపీ డిమాండ్

పెరంబూర్, ఏప్రిల్ 22: కోయంబత్తూర్, దక్షిణ చెన్నై తదితర నియోజకవర్గాల్లో రీ పోలింగ్ నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టినా, వాస్తవంగా ఎన్నికలు నిర్వహించేది రాష్ట్రప్రభుత్వ అధికారులన్నారు. డీఎంకే తనకున్న అధికార బలంతో తమకు అనుకూలంగా ఉన్న అధికారులను నియమించి 39 నియోజకవర్గాల్లో బీజేపీకి అనుకూలంగా ఉన్న ఒక వర్గం వారి ఓట్లు తొలగించారని ఆరోపించారు. ముఖ్యంగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పోటీచేసిన కోయంబత్తూర్, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పోటీచేసిన నీలగిరి, మాజీ గవర్నర్ తమిళిసై పోటీచేసిన దక్షిణ చెన్నై నియోజకవర్గాల్లో సుమారు లక్ష ఓట్లు తొలగించారన్నారు. ఇలాంటి చర్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనికి పాల్పడిన అధికారులపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే, ఎన్నికల్లో అవకతవకలు జరిగిన నియోజకవర్గాల్లో రీ పోలింగ్ నిర్వహించాలని ఆయన ఈసీకి విజ్ఞప్తి చేశారు.



ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా అన్నానగర్‌లో వళ్లియమ్మై మహిళా కళాశాలలో మొక్కలు పెంచుదాం భూమిని కాపాడుదాం అంటూ ప్లకార్డులతో అవగాహన ప్రదర్శన జరుపుతున్న విద్యార్థినులు

నడిగర్ సంఘం భవన నిర్మాణ పనులు ప్రారంభం



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాజర్, చిత్రంలో కార్తీ, పూచ్చి మురుగన్ తదితరులు

అడయార్, ఏప్రిల్ 22: నడిగర్ సంఘం భవన నిర్మాణ పనులు పునఃప్రారంభించారు. నిధుల కొరత కారణంగా ఈ భవన నిర్మాణ పనులు గత కొంతకాలంగా ఆగిపోయిన విషయం తెల్సిందే. అయితే, ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు నడిగర్ సంఘం కార్యవర్గ సభ్యులైన నాజర్, విశాల్, కార్తీ, పూచ్చి మురుగన్ తదితరులు నడుం బిగించి నిధుల సేకరణ ప్రారంభించారు. దీంతో పలువురు అగ్రహీరోలు ఈ భవన నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చారు. అలాగే, బ్యాంకు నుంచి రుణాలు కూడా తీసుకోవాలని నడిగర్ సంఘం సర్వసభ్య సమావేశంలోనూ తీర్మానించారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇందులో నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, కోశాధికారి కార్తీ, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రముఖ దర్శకుడు 'పసి' దురై మృతి



'పసి' దురై (ఫైల్‌ఫొటో)

అడయార్, ఏప్రిల్ 22: తమిళ చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ దర్శకుడు 'పసి' దురై మృతి చెందారు. తిరువళ్ళూరు జిల్లా వేపంపట్టులో ఉంటున్న ఆయన సోమవారం కన్నుమూసినట్టు ఆయన కుమారుడు ప్రకాష్ దురై వెల్లడించారు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో దాదాపు 45కు పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన తెరకెక్కించిన 'పసి' 1979లో ఉత్తమ చిత్రంగా, ఉత్తమ నటుడు అవార్డులను గెలుచుకుంది. అప్పటి నుంచి ఆయన పేరు చిత్రపరిశ్రమలో 'పసి' దురైగా స్థిరపడిపోయింది. ఆయన మృతిపట్ల చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులతో పాటు తమిళ సినీ దర్శకుల సంఘం, నడిగర్ సంఘం సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు.

నటుడు కమల్ హాసన్ ఇంట విషాదం



శ్రీనివాసన్ (ఫైల్ ఫొటో)

అడయార్, ఏప్రిల్ 22: అగ్రనటుడు కమల్ హాసన్ ఇంట విషాదం నెలకొంది. ఆయన కుటుంబంలో సీనియర్ సభ్యుడు, మాజీ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి శ్రీనివాసన్ గోపాలన్ (92) సోమవారం ఉదయం కొడైక్కెనాల్‌లో కన్నుమూశారు. ఈ విషయాన్ని హీరో కమల్ హాసన్ తన ట్విట్టర్ ఖాతాలో వెల్లడించారు. తమ కుటుంబంలో సీనియర్ సభ్యుడు, మామా అని ముద్దుగా పిలుచుకునే శ్రీనివాసన్ గోపాలన్ కొడైక్కెనాల్‌లో మృతి చెందారని, ఆయన భౌతిక కాయాన్ని ఎంఎన్‌ఎం కార్యకర్తల సందర్శనార్థం సోమవారం నగరానికి తీసుకొచ్చి ఆళ్వార్‌పేటలోని పార్టీ కార్యాలయంలో ఉంచి మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో బీసెంట్ నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేస్తామని కమల్ హాసన్ పేర్కొన్నారు.

జీసీసీలో 20 రోజుల్లో రూ.190 కోట్ల ఆస్తి పన్ను వసూలు

- ఈ నెలాఖరులోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ



జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం

పెరంబూర్, ఏప్రిల్ 22: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లో ఈ నెల 20వ తేది వరకు రూ.190 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. ఈ నెల 30వ తేది లోపు ఆస్తి పన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. జీసీసీ ఆదాయంలో ఆస్తి పన్ను ప్రధానమైనది. జీసీసీ పరిధిలో 13.59 లక్షల మంది యజమానుల నుంచి అర్థ సంవత్సరానికి రూ.850 కోట్లు, ఏడాదికి రూ.1,700 కోట్లు పన్నుల రూపంలో వసూలవుతోంది. ఆస్తుల యజమానులు ఏప్రిల్ 30వ తేదిలోగా తొలి అర్ధవార్షిక పన్ను, అక్టోబరు 30వ తేదిలోపు రెండవ అర్ధవార్షిక పన్ను చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత కాలంలో పన్ను చెల్లించే వారికి పన్నులో 5 శాతం (గరిష్ఠంగా రూ.5 వేల వరకు) రాయితీ ఇస్తున్నారు. ఆ గడువు దాటి తర్వాత చెల్లించే వారి నుంచి 1 శాతం వడ్డీ వసూలుచేస్తున్నారు.

రూ.227 కోట్లు అధికం...

2023-24 ఆర్థిక సంవత్సరంలో జీసీసీ నిర్ణయించిన పన్ను లక్ష్యం అధిగమించి రూ.1,800 కోట్లు ఆస్తి పన్ను వసూలైంది. ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రూ.227 కోట్లు అధికం. బకాయిలు వసూలుచేయడంలో భాగంగా దీర్ఘకాలంగా పన్ను చెల్లంచని వారి పేర్లను అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధవార్షిక ఆస్తి పన్ను వసూళ్లను ఎన్నికలకు ముందే కార్పొరేషన్ ప్రారంభించింది. ఆ ప్రకారం ఈ నెల 1 నుంచి 20వ తేది వరకు రూ.190 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. 2.31 లక్షల మంది ఆస్తి పన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందారు. ఈ నెల 30వ తేదిలోపు ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలని జీసీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు.



చెన్నైలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

వెట్రిమారన్ నిర్మాతగా లారెన్స్ చిత్రం

చిత్రజ్యోతి

జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ నిర్మాతగా దర్శకనటుడు రాఘవ లారెన్స్ హీరోగా ఒక చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత, ఫైవ్‌స్టార్ కదిరేశన్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం అధికారికంగా ప్రకటించారు. 2002లో 'పార్తాలే పరవశం' అనే చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన లారెన్స్... చిత్రపరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపుతో పాటు మార్కెట్ సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులకు కమిట్ అవుతూ బీజీగా కొనసాగుతున్నారు. యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ నిర్మాణంలో భాగ్యరాజ్ కన్నన్ దర్శకత్వంలో 'బెల్స్' అనే చిత్రంలో నటిస్తున్నారు. నిర్మాతగా లోకేష్ కనకరాజ్‌కు ఇది రెండో చిత్రం. అలాగే, లారెన్స్ తన 25వ చిత్రం 'హంటర్'లో నటిస్తున్నారు. వెంకట్ మోహన్ దర్శకుడు కాగా, దేవీశ్రీ ప్రసాద్ సంగీతం. ఇదిలావుండగా, నూతన దర్శకుడు దురై సెంథిల్ కుమార్ దర్శకత్వంలో 'అధికారం' పేరుతో ఒక చిత్రాన్ని రెండేళ్ల క్రితం ప్రారంభించి, మధ్యలోనే విడిచిపెట్టారు. ఇపుడు ఈ చిత్రాన్ని మళ్ళీ పట్టాలపైకి ఎక్కించనున్నారు. దర్శకుడు వెట్రిమారన్ కథ సమకూర్చనున్నారు. ఫైవ్‌స్టార్ కదిరేశన్, వెట్రిమారన్ కలిసి ఈ ప్రాజెక్టు నిర్మించనున్నారు. ఈ విషయాన్ని రాఘవ లారెన్స్ తన ట్విటర్ హ్యాండిల్‌లో అధికారికంగా వెల్లడించారు. దీంతో ఈ ప్రాజెక్టుపై ఇటు సినిమా వర్గాలోనే కాకుండా, అటు ప్రేక్షకుల్లో కూడా అంచనాలు పెరిగిపోయాయి.



నిర్మాత కదిరేశన్, వెట్రిమారన్, రాఘవ లారెన్స్

రీ-రిలీజ్‌లోనూ అదరగొడుతున్న 'గిల్లి'



'గిల్లి'లో విజయ్ - త్రిష

అగ్రహీరో విజయ్ - త్రిష జంటగా నటించిన చిత్రం 'గిల్లి'. 2004 ఏప్రిల్ 14వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ సాధించడమే కాకుండా, భారీ వసూళ్ళు రాబట్టి నిర్మాతకు, బయ్యర్లకు భారీ లాభాలు తెచ్చిపెట్టింది. ధరణి దర్శకత్వం వహించగా, విద్యాసాగర్ సంగీతం వహించారు. ఇందులోని అన్ని పాటలు సూపర్‌డూపర్ హిట్. పైగా, ఆ కాలంలో రూ.50 కోట్లు వసూలు చేసి తొలి చిత్రంగా రికార్డు సొంతం చేసుకుంది. పనిలో పనిగా హీరో విజయ్ మార్కెట్‌ను కూడా పెంచేసింది. ఈ సినిమా విడుదలై రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఇటీవల రీ రిలీజ్ చేశారు. 4కే డిజిటల్ టెక్నాలజీలో సినిమాకు మరిన్ని మెరుగులు దిద్ది.. రాష్ట్ర వ్యాప్తంగా 500కు పైగా థియేటర్లలో శక్తి ఫిలిమ్ ఫ్యాక్టరీ అధినేత శక్తివేలన్ రీరిలీజ్ చేయడమే కాకుండా, తొలి వసూళ్ళు కొన్ని కోట్లు కాదు... అనేక కోట్లు అంటూ వెల్లడించారు. దీనికి కారణం, ఈ సినిమా విడుదలైన అన్ని థియేటర్లకు ప్రేక్షకులు పోటెత్తుతున్నారు. ఈ నెల 19వ తేదీన జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద కూడా లేని రద్దీ గిల్లి థియేటర్ల వద్ద కనిపించిందని పలువురు వ్యాఖ్యానించడం, ఈ చిత్రానికి లభిస్తున్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.



కవిన్ సరసన ప్రీతి అస్రానీ?

శశికుమార్ హీరోగా నూతన దర్శకుడు మందిరమూర్తి దర్శకత్వంలో 2023లో వచ్చిన చిత్రం 'అయోధ్ది', యష్‌పాల్ శర్మ, ప్రీతి అస్రానీ హీరోయిన్లుగా నటించగా, పుగళ్, బోస్ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇందులో ప్రీతి అస్రానీ అమాయకమైన యువతిగా నటించి ప్రేక్షకుల మనసుల్లో స్థిరపడిపోయారు. పైగా ఈ చిత్రం సూపర్ హిట్ కావడంతో ఆమె ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. ఈ నేపథ్యంలో కవిన్ హీరోగా నటించే ఐదో చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ సతీష్ దర్శకత్వం వహించనున్నారు. కామెడీతో కూడిన ఎంటర్‌టైన్మెంట్ మూవీగా రూపొందించనున్నారు. 'అయోధ్ది' చిత్రంలో తాను పోషించిన పాత్ర కంటే ఇది పూర్తిభిన్నంగా ఉంటుందని ప్రీతి వెల్లడించారు. అలాగే, రియోరాజ్ హీరోగా నటించే మరో చిత్రంలో కూడా ఆమె ఎంపికయ్యారు.

డ్రగ్స్ స్మగ్లింగ్ నేపథ్యంలో 'సర్దార్-2'



పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తీ హీరోగా ద్విపాత్రాభినయం చేసిన చిత్రం 'సర్దార్'. 2022లో విడుదలై సూపర్ హిట్ జాబితాలో నిలిచింది. వసూళ్ళపరంగా రూ.100 కోట్లు సాధించింది. మినరల్ వాటర్ పేరుతో విక్రయించే తాగునీటిలో ఉండే శరీరానికి హానికలిగించే అంశాలు, వాణిజ్యపరమైన రాజకీయాలను దర్శకుడు కళ్ళకు కట్టినట్టు చూపించారు. ఇందులో హీరో కార్తీ పోలీస్ ఆఫీసర్‌గా, రా ఏజెంట్‌గా నటించి, ప్రేక్షకుల మనసులను గెలుచుకున్నారు. యాక్షన్, థ్రిల్లర్ కోణంలో సాగిన ఈ చిత్రంలో రజీషా విజయన్, రాశీఖన్నా, లైలా, చుంకీ పాండే ప్రధాన పాత్రలను పోషించగా జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సీక్వెల్ రూపొందనుంది. ఈ దఫా డ్రగ్స్ అక్రమ రవాణాను ప్రధానాంశంగా చేసుకుని 'సర్దార్-2'ను తెరకెక్కించాలని దర్శకుడు పీఎస్ మిత్రన్ ప్లాన్ చేసినట్టు సమాచారం. ముఖ్యంగా సమాజానికి, యువతకు మాదకద్రవ్యాలు (డ్రగ్స్) ఏ విధంగా హాని కలిగిస్తున్నాయే అంశంతో యవతలో చైతన్యం, అవగాహన కల్పించేలా ఈ కథను సిద్ధం చేసినట్టు తెలుస్తుంది. అయితే, ఈ ప్రాజెక్టుపై అధికారికంగా ప్రకటన వెలువడాల్సివుంది.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఇష్టదేవేరులతో తాయుమానవర్‌స్వామి

మలైకోట తాయుమానవర్ ఆలయ రథోత్సవం

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి మలైకోట తాయుమానవర్‌స్వామి ఆలయ రథోత్సవం సోమవారం ఉదయం కనుల పండువగా నిర్వహించారు. ఆ ఆలయంలో వార్షిక చిత్తిరై ఉత్సవాలు ఈ నెల 14న ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ స్వామి, అమ్మవారికి పగటిపూట ప్రత్యేక అభిషేకాలు, రాత్రివేళ ప్రత్యేక అలంకరణలతో వివిధ వాహన సేవలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఐదో రోజు తన భక్తురాలైన రత్నావతికి పురుడు పోసేందుకు ఆమె తల్లి రాలేకపోవడంతో పరమశివుడే తల్లిలా ఆమెకు పురుడు పోసిన పురాణఘట్టాన్ని ప్రదర్శింపజేశారు. ఆరోజు స్వామి, అమ్మవారి కల్యాణోత్సవం జరిగింది. ఈ వేడుకలలో తొమ్మిదో రోజైన సోమవారం వేకువజాము 4.30 గంటలకు మేష లగ్నంలో స్వామి, అమ్మవారు సర్వాలంకరణశోభితులై ఆలయం నుంచి బయలుదేరి మలైకోట అంతర వీధిలో వేంచేశారు. వేకువజాము 5.40 గంటలకు తాయుమానవర్ స్వామి సమేత మట్టువార కుళలమ్మై పెద్ద రథంలోను, తాయార్ చిన్న రథంలోనూ కొలువుదీరారు. ఉదయం 6.10 గంటలకు వేలాదిమంది భక్తులు రథానికి ఇరువైపులా మోకుతాళ్ళను లాగటంతో రథోత్సవం ప్రారంభమైంది. రథోత్సవాన్ని మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి ప్రారంభించారు. పంచమూర్తులు చిన్న సప్పరంలో ఊరేగుతుండగా, ఆ సప్పరం వెనుకనే పెద్ద, చిన్న రథాలు వరుసగా బయలుదేరాయి.

చెట్‌పెట్ జలాశయం కింద సొరంగం తవ్వకాల్లో 'తామ్రభరణి'



పెరంబూర్, ఏప్రిల్ 22: మెట్రోరైలు రెండో ప్రాజెక్ట్‌లో, మాధవరం-సిరుచ్చేరి సిప్కాట్ వరకు, మూడో మార్గంలో, చెట్‌పెట్ నుంచి కీల్పాక్కం వైపు సొరంగం తవ్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అందులో భాగంగా చెట్‌పెట్ జలాశయం కింద సొరంగం తవ్వకాలు మరికొన్ని వారాల్లో ప్రారంభమవుతాయని సీఎంఆర్‌ఎల్ అధికారులు తెలిపారు. నగరంలో మెట్రోరైలు ప్రాజెక్ట్‌లో మూడు మార్గాల్లో 116.1 కి.మీ మేర పనులు చేపడుతున్నారు. అందులో ఒక మార్గంగా మాధవరం-సిరుచ్చేరి సిప్కాట్ వరకు 45.4 కి.మీ దూరం చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ మార్గంలో 2.8 కి.మీ దూరం ఉన్న చెట్‌పెట్ నుంచి నుంగంబాక్కం వరకు సొరంగం తవ్వే పనులు గత ఏడాది సెప్టెంబరులో ప్రారంభం కాగా, ఇప్పటివరకు 225 మీటర్ల మేర సొరంగం పూర్తయింది. రెండవ సొరంగం తవ్వే పనులు 80 మీటర్ల దూరం జరిగాయి.

కీల్పాక్కం వైపు...

చెట్‌పెట్ నుంచి కీల్పాక్కం వైపు సొరంగం తవ్వే పనులు పది రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. ఈ విషయమై సీఎంఆర్‌ఎల్ అధికారి మాట్లాడుతూ... చెట్‌పెట్ ఉత్తరం-కీల్పాక్కం వైపు సొరంగం తవ్వే పనులు 'తామ్రభరణి' అనే యంత్రం ద్వారా చేపట్టామన్నారు. ప్రస్తుతం చెట్‌పెట్ రైల్వేస్టేషన్ సమీపంలో సొరంగం తవ్వే పనులు జరుగుతున్నాయని తెలిపారు. చెట్‌పెట్, కీల్పాక్కం రెండు రైల్వేస్టేషన్ల మధ్య 838 మీటర్ల వరకు ఈ యంత్రం పనిచేయనుందని తెలిపారు. తొలుత చెట్‌పెట్ రైలు మార్గం దాటి వెళ్లాల్సి ఉందన్నారు. అనంతరం చెట్‌పెట్ జలాశయం కింద నేల స్థాయి నుంచి 18 మీటర్ల లోతున సొరంగ మార్గం నిర్మించనున్నట్లు, ఈ పనులు సవాళ్లతో కూడుకున్నవని ఆయన తెలిపారు. కాగా, మెట్రోరైలు పథకంలో సొరంగం తవ్వే యంత్రాలకు రాష్ట్రంలోని ప్రధాన నదులు, ప్రాంతాలు పేరు పెట్టిన విషయం విదితమే.



నేడు కళ్లలగర్ వైగై నది ఆగమన మహోత్సవం

- 2,400 మందికి అనుమతి

ప్యారీస్, ఏప్రిల్ 22: ఆలయాల నగరం మదురైలో నిర్వహించే చిత్తిరై ఉత్సవాలు ప్రపంచప్రసిద్ధి చెందినవి. అందులోనూ వరాలు ప్రసాదించే కళ్లలగర్ వైగై నదిలో వేంచేసే ఘట్టాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. స్వామివారం నదిలో దిగే సమయంలో ఆయనపై పవిత్ర జలాలు చల్లి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో, మదురైలో ప్రస్తుతం కోలాహలంగా నిర్వహిస్తున్న చిత్తిరై ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి హిందూ దేవాదాయ శాఖను హైకోర్టు మదురై బెంచ్ ప్రశంసించిది. ఇదిలా ఉండగా, కళ్లలగర్ వైభవంలో ఈ సారి ఎక్కువ మంది భక్తులను అనుమతించని హైకోర్టు, 2,400 మందికి మాత్రమే అనుమతించింది. ప్రాచీన సంప్రదాయ సిద్ధాంతాలను తప్పకుండా పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రసాయనాలు కలిపిన నీటిని కానీ, పాలు, పెరుగు కలిపిన నీటిని కానీ కళ్లలగర్‌పై చల్లకుండా న్యాయస్థానం నిబంధనలు విధించింది. కళ్లలగర్ వేడుకల్లో న్యాయస్థానం విధించిన నిబంధనలను అలాగే పాటించాలని, నదిలో దిగకుండా వేడుకలకు హాజరయ్యే భక్తుల దాహార్తి తీర్చేందుకు చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలని, ముఖ్యంగా వేదిక ప్రాంగణానికి కిలోమీటర్ దూరంలోనే వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని, వాచ్ టవర్ల ద్వారా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించాలని హైకోర్టు సూచించింది.

ఈజిప్టియన్ కాటన్ బెడ్‌షీట్ల ఆవిష్కరణ



వెదురు ఈజిప్టియన్ కాటన్ బెడ్‌షీటు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అడయార్, ఏప్రిల్ 22: రిలాక్స్ హోం టెక్స్‌టైల్ సంస్థ ఎకో ఫ్రెండ్లీ ఫైనెస్ట్ బేంబూ ఈజిప్టియన్ కాటన్ బెడ్‌షీట్స్ అవిష్కరించారు. నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ప్రాడక్ట్ లాంచ్ కార్యక్రమంలో ఈ సంస్థకు చెందిన నిర్వాహకులు శరవణన్, పళనియప్పన్, రేవతితో కలిసి ఆవిష్కరించారు. ఇందులో ప్రతి ఇంటికి అనువైన ఈజిప్టియన్ కాటన్ టీసీ400 బెడ్ షీట్స్‌తో పాటు ఫైనెస్ట్ వెదురు బెడ్‌షీట్స్, ఈకో ఈసీ కలెక్షన్స్, బేంబూ దోహర్స్ ఉన్నాయి. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా వీటిని తయారు చేసి, దేశీయంగానే కాకుండా, యూఏఈ, సింగపూర్ తదితర దేశాల్లో కూడా అందుబాటులోకి తీసుకుని వెళ్లనున్నట్టు వారు తెలిపారు. ప్రతి ఇంటికీ లగ్జరీ హంగులు సమకూరేలా ఈ కాటన్ బెడ్ షీట్స్ ఉంటాయన్నారు.


మేట్టూరులో అడుగంటిన నీటిమట్టం

- జూన్ 12న జలాల విడుదల అసాధ్యమేనా?



ప్యారీస్, ఏప్రిల్ 22: రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండుతున్న కారణంగా సేలం జిల్లా మేట్టూరు డ్యాం నీటిమట్టం అడుగంటింది. సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో డ్యాంలో 55 అడుగుల నీరు మాత్రమే నిల్వ ఉందని, ఇందువల్ల జూన్ 12వ తేది పంట పొలాలకు సాగునీరు విడుదల చేసే అవకాశం లేదని అధికారులు తెలిపారు. రాష్ట్రం లో డెల్టా జిల్లాల్లో కావేరి సాగు వ్యవసాయ పనుల నిమిత్తం మేట్టూరు డ్యాం నీటిని జూన్ రెండవ వారంలో విడుదల చేస్తుంటారు. ఈ సీజన్‌లో ఈశాన్య రుతుపవనాలు కూడా ప్రారంభమై భారీవర్షాలు కూడా ప్రారంభమవుతాయి. ఇందువల్ల మేట్టూరు డ్యాంలో చేరే నీటి శాతం క్రమక్రమంగా పెరుగుతుండడంతో డ్యాం నుంచి తాగడానికి, సేద్యానికి అవసరమైన నీరు విడుదల చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాలు సక్రమంగా వర్షించకపోవడంతో డెల్టా జిల్లాల్లో అవసరమైన సాగునీరు అందుబాటులో లేక పొలాలు బీడు బారాయి. దీనికి తోడు ఈ సారి ఏప్రిల్ మొదటి వారం నుంచే వేసవిని తలపించేలా ఎండలు మంతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సైతం మరింత పెరిగాయి. అందువల్ల ఆనకట్టలు, చెరువుల్లో ఉన్న నీరు ఆవిరిగా మారుతోంది. ప్రస్తుతం 55 అడుగులుగా ఉన్న మేట్టూరు డ్యాం నీటిమట్టం మరికొద్దిరోజుల్లో 20 అడుగులకు పడిపోయే అవకాశముంది. నీటిమట్టాన్ని సోమవారం ఉదయం పరిశీలించిన ప్రజాపనుల శాఖ అధికారులు కావేరి డెల్టా ప్రాంతాల్లో సుమారు 5.25 లక్షల ఎకరాల పంట భూములకు వచ్చే జూన్ 12న సాగునీరు విడుదల చేసే అవకాశం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

జన కేతనం



ఈడ ఆయన పెత్తనం ఏందబ్బా..!




'ఈరోజు నామినేషన్ వేసేదానికి ఆయప్పతో కూడా పెద్దాయన వస్తున్నాడంటా కదబ్బా' అంటూ టీ తాగేందుకు వచ్చిన సుబ్బయ్యను అడిగాడు టీ కొట్టు వెంకటేశులు. 'ఔనబ్బా నాక్కూడా నిన్న మధ్యాహ్నందా తెలిసింది' అన్నాడు దీర్ఘంగా రాగం తీస్తూ సుబ్బయ్య. 'ఏందబ్బా ఇది.. ఎక్కడో ఉండే ఆయనకి ఇక్కడ పెత్తనం ఎందుకబ్బా. ఈ అయిదేండ్లు ఇక్కడ మొత్తం గాలి చేసేశాడు. నడిచేదానికి రోడ్డు కూడా లేకుండా చేశాడు మహానుభావుడు. మళ్లీ ఇప్పుడు యాడనుంచో ఒకాయను తీసుకొచ్చి నిలబెడుతున్నాడు' విసుక్కుంటూ అన్నాడు వెంకటేశులు. పేపర్ చదువుతూ లీనమైపోయి ఉన్న రామయ్య తలపైకెత్తి ఇద్దరు వైపు చూస్తూ, 'నామినేషన్‌కు కూడా ఈయన రావాల్సిందేనా. ఏందోబో. మనూరు ఏమైపోతోందో. చివరకు మనమందరం మెడ్రాసుకు ఎళ్లిపోవాల్సిందేనా' అని విచారంగా అన్నాడు. సుబ్బయ్య కలగజేసుకుని 'ముందు మన నాయకులను అనాలి. ఆ పెద్దాయన చెప్పినట్టే పాడుతున్నారు'. ఇంతలో పేపర్ చదువుతున్న రామయ్య పేపర్ మడిచి టేబుల్‌పై పెడుతూ 'సరేలే..బ్బా.. జనాలు మాత్రం ఈ సారి సర్దిగ్గా చేస్తారు చూడు. ఈ దెబ్బతో మళ్లీ ఆయన ఈడ కనబడడు' అని కసిగా అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఈ సంభాషణ అంతా సత్యవేడు పట్టణంలో ఒక టీ బంకు దగ్గర జరిగింది. వైసీపీ అభ్యర్థి గురించీ, ఇక్కడి రాజకీయాలను శాసిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి గురించీ స్థానిక ప్రజల్లో ఎంత చర్చ జరుగుతూ ఉందో ఈ సంభాషణ అద్దం పడుతోంది.

-సత్యవేడు

హమారా ఘర్‌మే .. నై .. మేలు .. జా... జా...!

ఇదీ సంగతి





నాయుడుపేట మూడో వార్డులో ప్రచారానికి ఇంటింటి గడప తొక్కుతున్న వైసీపీ నాయకులు అక్కడి ప్రజల మాటలతో అవాక్కయ్యారు. ఏ ఇంటికి జగన్ ఎంత మేలు చేశాడో లెక్కగట్టి ముద్రించిన కరపత్రాలు పంచుతూ ఓట్లడుగుతుండగా ఒక ఇంటి వాళ్లు కరపత్రం చూపిస్తూ 'హమారా ఘర్‌మే .. నై .. మేలు .. జా... జ. జా' అంటూ మొహంమీదే అనేశారు. జగన్ పథకాల లబ్ధి ఏదీ ఆ ఇంటికి దక్కకపోవడమే ఇందుకు కారణం. ప్రచారానికి వచ్చిన నాయకులు వారికి నచ్చజెప్పే మాటలేవో మొదలు పెట్టగానే ఆ ఇంటివారు విసుక్కున్నారు. 'సీఎం జగన్ సిద్ధం సభలో ఏం చెప్పినాడు' అని ప్రశ్నించారు. 'మీ బిడ్డ.. ఈ జగన్ మిమ్మల్ని కోరేది ఒకటే.. మీ కుటుంబంలో ఎవరికైనా మేలు జరిగే ఉంటే.. నాకు ఓటు వేయండి.. మంచి జరగకుంటే ఓటు వేయద్దు.' అన్నాడా లేదా అని నిలదీశారు. 'ఆ యబ్బాయి చెప్పిందే కదా.. మా ఇంటికి మేలేమీ జరగలేదు కాబట్టి మా ఓట్లు అడగద్దు' అని తెగేసి చెప్పేశారు. ఇదే తీరులో రెండు మూడు ఇళ్లలో ఎదురవడంతో వైసీపీ ప్రచార బృందం బిక్కమొహాలు వేసుకుని వెనుతిరిగారు.

- నాయుడుపేట/ టౌన్

ఆటా.. పాటా



ప్రచారాల్లో ట్రెండ్ మారింది. టెక్నాలజీకి ప్రాధాన్యం పెరిగింది. ఒకవైపు సోషల్ మీడియాను వేదికగా మార్చుకోగా మరోవైపు ప్రత్యక్ష ప్రచారాల్లోనూ వీడియో డిస్‌ప్లే స్క్రీన్‌లు వినియోగిస్తున్నారు. వీటిల్లో గ్రాఫిక్స్, తమ కోసం రూపొందించుకున్న పాటలు, షార్ట్ ఫిల్ములు వంటివి ప్రదర్శిస్తున్నారు. ఈ వాహనాలు పల్లెలను చుట్టేస్తున్నాయి. అచ్చం సినిమా టజర్‌ల లాగే అభ్యర్థులతో టీజర్‌లు రూపొందించి విడుదల చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే అభ్యర్థులను కీర్తిస్తూ పాటలు కట్టి పాడి వీడియో దృశ్యాలుగా షూట్ చేసి ప్రదర్శించడం మరొక ఎత్తు. పార్టీల ప్రచార పాటలతో పాటూ ఒక్కో అభ్యర్థి పేరుతో కనీసం పది పాటలు కొత్తగా రూపొందిస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో ఈ పాటలు హోరెత్తుతున్నాయి. సినిమా స్టయిల్‌లో స్వరాలు కూర్చి అదే పద్ధతిలో డాన్సులు చేయించి వీటిని రికార్డు చేస్తున్నారు. యూట్యూబ్‌లోనూ ఇవి హల్‌చల్ చేస్తున్నాయి. ఈ పాటలు రాయించి, రికార్డు చేయడం కోసం చెన్నై, హైదరాబాద్‌లకు పరుగులు తీస్తున్నారు.

- డక్కిలి

ఓటర్ల నాడి కోసం..

అభ్యర్థుల తరుపున కుటుంబసభ్యులు ప్రచారం చేయడం సాధారణం. గూడూరు బరిలో నిలిచిన ప్రధాన పార్టీ అభ్యర్థులిద్దరి పక్షాన వారి తనయులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ విశేషమేమిటంటే అభ్యర్థుల తనయులిద్దరూ వైద్యులు. టీడీపీ తరఫున పోటీ చేస్తున్న పాశిం సునీల్‌కుమార్ కుమారుడు జశ్వంత్‌కుమార్ ఎంబీబీఎస్ పూర్తిచేసి పీజీ జనరల్ మెడిసిన్ చేస్తున్నారు. అధికార వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తనయుడు రేవంత్‌చక్రవర్తి కూడా పీజీ ఆర్థోపెడిక్ చేస్తున్నారు. ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి ఈ యువ డాక్టర్లిద్దరు గూడూరులో తండ్రుల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.


- గూడూరు అర్బన్



ప్రచారం నిర్వహిస్తున్న మేరిగ రేవంత్‌చక్రవర్తి



ప్రచారంలో పాశిం జశ్వంత్‌కుమార్



తిరుపతి
ఆంధ్రజ్యోతి

రద్దయిన డీకేటీ పట్టాలను నేను అధికారంలోకి రాగానే రైతులకు ఇప్పించేస్తా.

2018 జనవరి 10న చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం అనుప్పల్లిలో పాదయాత్ర సందర్భంలో జగన్ అన్న మాట ఇది.

జగన్‌రెడ్డి హామీ ఇచ్చి 68 నెలలు గడచింది. మరి ఏం జరిగింది?

పట్టాలెక్కడ జగనా?

అనుప్పల్లి రైతుల గోడు



విపక్ష నేత వైఎస్ జగన్ 2018లో పాదయాత్ర సమయంలో అనుప్పల్లి పంచాయతీ నెమళ్ళగుంటపల్లిలో రైతు సదస్సు నిర్వహించారు. డీకేటీ పట్టాల రద్దు సమస్యను వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జగన్‌కు నివేదించారు. తాను అధికారంలోకి రాగానే బాధిత రైతులకు భూములను తిరిగి ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఐదేళ్ళు గడిచిపోయినా పట్టాలు పునరుద్ధరించలేదు. బాధిత రైతులు ఇపుడు సీఎం జగన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డిపైనా మండిపడుతున్నారు.

అనుప్పల్లి సమస్య ఇదీ..

1996-2004 మధ్య అనుప్పల్లి పంచాయతీలో టీడీపీ ప్రభుత్వం, 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం 200 మంది పేద రైతులకు సుమారు 300 ఎకరాలు కేటాయించాయి. పట్టాలు కూడా జారీ చేశాయి. కొందరు ఆ పట్టాల ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. మరికొందరు బోర్లు తవ్వుకుని మామిడి మొక్కలు నాటుకున్నారు. ఏడేళ్ళ కిందట రెవిన్యూ అధికారులు పట్టాల జారీ సక్రమంగా జరగలేదని రద్దుకు ప్రతిపాదించారు. సర్వే నంబరు 410 నుంచీ 493 వరకూ ఉన్న భూముల పట్టాలను రికార్డుల్లో నమోదు చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించడం రైతులకు శాపంగా మారింది. 2017లో అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న ఈ డీకేటీ పట్టాలను రద్దు చేశారు. బాధిత రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా న్యాయం జరగలేదు. విసిగి వేసారిన రైతులు భూములపై ఆశలు వదిలేసుకున్నారు.

జగన్‌ను నమ్మి చెడ్డా

ప్రభుత్వం మాకు 2.95 ఎకరాల డీకేటీ పట్టా ఇచ్చింది. దీని మీద బ్యాంకులో రుణం తీసుకున్నాం. అధికారులు తర్వాత పట్టా రద్దుచేశారు. దీంతో ఆన్‌లైన్‌లో నా పేరు కనపడక రుణ మాఫీ వర్తించకుండా పోయింది. బ్యాంకులో రూ.లక్ష రుణం తీసుకుంటే వడ్డీ పెరిగి రూ.2 లక్షలు అయింది. పాదయాత్రలో జగన్ మా ఊరొస్తే గోడు వెళ్ళబోసుకున్నాం. అధికారంలోకి వస్తానే పట్టాలు ఇస్తామని తర్వాత పట్టించుకోలేదు. ఆయన్ను నమ్మి మోసపోయా.

- ఎన్.లక్ష్మమ్మ, అనుప్పల్లి



సీఎం అయ్యాక పట్టించుకోలేదు



మా స్వాధీనంలో ఉన్న 75 సెంట్ల భూమికి 2008లో ప్రభుత్వం పట్టా ఇచ్చింది. అందులో మామిడి తోట పెట్టుకున్నా. కొన్నేళ్ళకు అధికారులు పట్టాను రద్దు చేశారు. ప్రతి గ్రామసభలో ఫిర్యాదు చేస్తూనే వున్నాం. న్యాయం జరగలేదు. పాదయాత్రలో జగన్‌కు కూడా చెప్పుకున్నాం. మాటిచ్చి ప్రభుత్వం వచ్చాక పట్టించుకోలేదు.

- చిన్నస్వామి, గోకులాపురం

ఎమ్మెల్యే కూడా న్యాయం చేయలేదు

పట్టాల రద్దు విషయం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి చాలా సార్లు చెప్పాం. ఆయన కూడా న్యాయం చేయలేదు. జగన్ మా ఊరి కొచ్చినపుడు ఆయనకూ చెప్పాము. పట్టాలు రద్దు చేసినందున రుణమాఫీ కాలేదు. తీసుకున్న రుణానికి బ్యాంకు అధికారులు నోటీసుల మీద నోటీసులు పంపిస్తా వుంటే బిడ్డ పెళ్లికి పెట్టుకున్న డబ్బు కట్టేసినాము.

- కె.ధనలక్ష్మి, గోకులాపురం



మోసపోయా




2008లో మాకు 1.50 ఎకరా ఇచ్చారు. డీకేటీ పట్టా ఇచ్చినందున మామిడి మొక్కలు నాటుకున్నాము. తోట ఎదిగినాక 2017లో రెవెన్యూ అధికారులు పట్టా రద్దు చేశారు. ఆన్‌లైన్‌లో పేరు తీసేశారు.. అధికారంలోకి రాగానే డీకేటీ పట్టా తిరిగి ఇప్పిస్తామని జగన్ హామీ ఇచ్చారు. పదవీ కాలం కూడా పూర్తయిపోతున్నా మాకు మాత్రం న్యాయం చేయలేదు.

- బి.మోహనరాణి, అనుప్పల్లి

సిరా చుక్క కత

డక్కిలి, ఏప్రిల్ 22 : ఎన్నికల్లో ఓటు వేశాక పోలింగ్ కేంద్రంలో ఓటరు చూపుడు వేలిపై సిరా చుక్క గుర్తుగా పెడుతుంటారు. దీంతో సదరు ఓటరు మరో ఓటు వేయడానికి వీలుండదు. దొంగ ఓట్ల కట్టడికి ఎన్నికల కమిషన్ ఎప్పుడో రూపొందించిన నిబంధన ఇది. ఈ సిరా గుర్తు 72 గంటల పాటు చెరిగిపోదు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సాధ్యం కాదు. మైసూరుకు చెందిన మైసూరు పెయింట్స్ అండ్ వార్నిష్ అనే పరిశ్రమ ఈ ఇంకును తయారు చేస్తోంది. 1962 నుంచి దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఈ సిరానే ఎన్నికల కమిషన్ ఉపయోగిస్తోంది. ఈ సిరాలో 7.25 శాతం సిల్వర్, నైట్రేట్ కలపడం వల్ల అంత తొందరగా చెరిగిపోదని నిపుణులు చెబుతారు.



తిరుపతి వర్తమానం



కూటమి కలయికతో స్పీడు తగ్గిన ఫ్యాను

సిటింగ్ ఎమ్మెల్యేకు బదులు ఆయన తనయుడు పోటీచేయడం, టీడీపీ కాకుండా దాని మిత్ర పక్షమైన జనసేన నుంచి చిత్తూరు సిటింగ్ ఎమ్మెల్యే బరిలో నిలబడటంతో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నిక ఈసారి ఆసక్తిదాయకంగా మారింది. గత ఎన్నికల్లో స్వల్ప ఆధిక్యతతో గట్టెక్కిన వైసీపీ ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఈదఫా తాను పోటీ చేయకుండా వారసునిగా కుమారుడు, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అభినయరెడ్డికి పార్టీ టికెట్ సంపాదించుకున్నారు. వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతి బరిలో నిలిచారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- ఏకతాటిపైకి ఎన్డీఏ కూటమి నాయకులు
- వైసీపీ నుంచి పెద్ద ఎత్తున చేరికలు
- ఆ పార్టీలో అవినీతి ఆరోపణల గుబులు

● పవన్ పర్యటనతో వైసీపీలో గుబులు

కొద్దిరోజుల క్రితం ఆరణి అభ్యర్థిత్వంపై తిరుపతి ఎన్డీఏ కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ)లోని అసమ్మతి పోరు తనకు ఉపకరిస్తుందని వైసీపీ ఆశలు పెట్టుకుంది. కానీ టీడీపీ, జనసేన అధినేతలు స్వయంగా జోక్యం చేసుకుని పార్టీ నాయకులలోని అసంతృప్తిని చల్లార్చారు. పవన్ కల్యాణ్ పర్యటనతో అసమ్మతి పటాపంచలైంది. దీంతో వైసీపీలో గుబులు పట్టుకుంది. ఐదేళ్లుగా జరిగిన స్థానిక, ఉప, టౌన్ బ్యాంకు ఎన్నికలన్నింటిలోనూ ఫేక్ ఓట్లపైనే ఆధారపడ్డ అధికార పార్టీ, సార్వత్రిక ఎన్నికల్లోనూ అదేపంథాలో నడవాలన్న పన్నాగం సిద్ధం చేసుకున్నా ఈసారి బెడిసికొట్టింది. తన తండ్రికి ఆఖరి ఏడాది దక్కిన టీటీడీ చైర్మన్ పదవితో అడ్డగోలుగా శ్రీవారి నిధులు దుర్వినియోగమయ్యామనే విమర్శలు అభినయ్ విజయాన్ని ప్రభావితం చేస్తాయని పార్టీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు అయిష్టంగానే ప్రచారంలో పాల్గొంటున్నట్టుగా కనిపిస్తోంది. ఫలితంగా అధికార వైసీపీలో మునుపటి ఉత్సాహం కనిపించడంలేదు.

అలుపెరగని ప్రచారం : జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఏడు పదుల వయస్సులోనూ ఎండను సైతం లెక్కచేయకుండా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఉదయం వాకర్స్‌తో కలిసి నడుస్తూ ప్రచారం చేస్తూ ఆతర్వాత కూటమి నాయకులతో ఇంటింటా తిరుగుతున్నారు. గాజు గ్లాసు గుర్తును ప్రజల చెంతకు తీసుకుపోతున్నారు. సొంత నిధులతో మసీదులు, ఈద్గా మైదానాల ఆధునీకరణ చేస్తామని రంజాన్ పర్వదినం సందర్భంగా ఆయన ప్రకటించి ముస్లిం సోదరుల అభిమానాన్ని కూడగట్టుకున్నారు. కూటమి నాయకులందరూ ఏకతాటి మీదకు రావడంతో తిరుపతిలో రాజకీయ వాతావరణం పూర్తిగా మారిపోయింది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే, నియోజవకర్గ ఇంచార్జి సుగుణమ్మ, జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్‌తో పాటు టీడీపీ నేతలు ఊకా విజయకుమార్, బేబీ శ్రీనివాస్ తదితరులు మూకుమ్మడిగా ప్రచారంలో కదలడంతో కూటమి శ్రేణుల్లో సంబరం నెలకొంది. టీడీపీ సీనియర్ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి (పెద్దబ్బ) వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

చేరికలతో కూటమిలో ఉత్సాహం

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత వైసీపీ నేతలు అన్నా రామచంద్రయ్య, అన్నా రామకృష్ణయ్య సోదరులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. కార్పొరేటర్లుగా ఉన్న వారి ఇద్దరు కుమార్తెలు కూడా ఆ పార్టీనుంచి బయటకు వచ్చేశారు. జనసేన, టీడీపీలో నిత్యం చేరికలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొలకల మల్లికార్జున్ ఇటీవల పవన్ సమక్షంలో జనసేనలో చేరి నగరంలో భారీ ర్యాలీకూడా నిర్వహించారు. మరో యువనాయకుడు పాటకం వెంకటేష్ కూడా జనసేనలోకి చేరబోతున్నట్టు తెలుస్తోంది.

వామపక్షాల బలమేంటో...

ఇండియా కూటమిలో తిరుపతి అసెంబ్లీ సీటు సీపీఐకి దక్కింది. ఇక్కడ వామపక్షాల నేతలు వైసీపీ ఎమ్మెల్యేతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతుంటారన్న విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళీతో పాటు వామపక్ష నేతలు వైసీపీ నేతలపై భూకబ్జాలు, దౌర్జన్యాలు, అవినీతి వంటి అనేక ఆరోపణలపై పల్లెత్తి మాట అన్న దాఖలాలు లేవు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం వెనుక భారీ అవినీతి జరిగిందని లోకమంతా కోడై కూసినా టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై వీరు ప్రశ్నించిందిగానీ, ఖండించిందీ లేదు. టీటీడీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేశారంటూ కరుణాకరరెడ్డిని సన్మానాల్లో ముంచెత్తిన నాయకులు ఆయన కుమారుడిపై ఎలా పోరాడుతారో అని జనం అనుకుంటున్నారు.